క్లుప్తంగా

హైకోర్టు జడ్జిని కలిసిన ఎస్పీ



జస్టిస్ రాజశేఖర్‌రావుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాకు విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తర్లాడ రాజశేఖర్‌రావును ఆదివారం ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కాసేపు మాట్లాడుకున్నారు.

బాణసంచా విక్రయాలకు అనుమతి తప్పనిసరి

ఎచ్చెర్ల క్యాంపస్: బాణసంచా విక్రయాలకు ప్రభుత్వ నిబంధనల మేరకు అనుమతులు తప్పనిసరిగా ఉండాలని ఎచ్చెర్ల ఎస్సై వి.సందీప్‌కుమార్ అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎటువంటి ప్రమాదాలు, సమస్యలు లేకుండా దీపావళి పండగను ఆనందంగా జరుపుకోవాలని చెప్పారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు.

లలితాదేవికి ప్రత్యేక పూజలు



పూజలందుకుంటున్న అమ్మవారు

ఎచ్చెర్ల : మండలంలోని దోమాం గ్రామంలో లలితాదేవి ఆలయంలో ఆదివారం దశమి రోహిణి నక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమ పూజలు చేశారు. దేవీ ఆశ్రమం అర్చకులు, వంశీకుమార్, ఆలయ ధర్మకర్త నరసింగారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన పూజా కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కాలభైరవస్వామికి విశేష పూజలు



స్వామికి హారతి

శ్రీకాకుళం కల్చరల్: బలగ నాగావళి తీరంలోని బాలా త్రిపుర కాలభైరవ పీఠం దేవాలయంలో ఆదివారం స్వర్ణాకర్షణ కాలభైరవ స్వామికి విశేష పూజలు నిర్వహించారు. పీఠం నిర్వాహకులు గణేష్ గురూజీ ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకాలు, హారతులు ఇచ్చి ప్రత్యేకంగా అలంకరించారు. గోపూజ, నిత్యాన్నదానం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఇంటర్నేషనల్ బెస్ట్ రీసెర్చర్‌గా సౌజన్య



అవార్డులతో డాక్టర్ తంగి సౌజన్య

అరసవల్లి: నగరానికి చెందిన డెంటిస్ట్ డాక్టర్ తంగి సౌజన్య అంతర్జాతీయ అవార్డుకు ఎంపికయ్యారు. ఇటీవల చెన్నైలో జరిగిన ఆసియా రీసెర్చ్ అవార్డు (ఇస్రా–2024) కార్యక్రమంలో ఈమె ప్రతిపాదించిన జర్నల్‌కు ఇంటర్నేషనల్ బెస్ట్ రీసెర్చర్‌గా గుర్తించి తమిళనాడు విద్యాశాఖ మంత్రి అంబిల్ మహేష్ పొయ్యమోజి చేతుల మీదుగా ప్రత్యేక పురస్కారాన్ని అందుకున్నారు. అలాగే, ఇంటర్నేషనల్ అవుట్‌స్టాండింగ్ రీసెర్చ్ అవార్డు కూడా దక్కింది. ఈమె దివంగత మాజీ అసెంబ్లీ స్పీకర్ తంగి సత్యనారాయణ మనుమరాలు.

నాగవంశీయుల నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గమిదే..

శ్రీకాకుళం రూరల్: నాగవంశీయుల నూతన కార్యవర్గ ఎన్నిక నగరంలోని అంబేడ్కర్ ఆడిటోరియంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గుర్రం జాషువా అవార్డు గ్రహీత నల్లి ధర్మారావు మాట్లాడుతూ వివిధ రంగాల్లో ఉన్న నాగవంశీయులంతా ఏకతాటిపైకి వచ్చి నాగవంశీయులను అభివృద్ధికి సహకరించాలని కోరారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా ముని శ్రీనివాసరావు, సెక్రటరీగా మొఖర వెంకట మల్లేశ్వరావు, అసోసియేట్ అధ్యక్షుడిగా నల్లి అప్పల నాయుడు, ఆర్గనైజేషన్ సెక్రటరీగా బోణ రాజేశ్వరరావు, కోశాధికారిగా కొన్ని సూరిప్రకాశ్, ఉపాధ్యక్షుడిగా కనకల రామారావు, పలువురు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

సర్కారీ వాహనాలకు.. నిర్లక్ష్యపు తుప్పు

- ముున్సిపల్ ఆదాయానికి భారీగా గండి
- అమ్మకానికి నోచుకోని పాత వాహనాలు
- అధికారుల తీరుపై విమర్శలు



మూలకు చేరిన డీసీఎం వాహనాలు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): మున్సిపల్ కార్పొరేషన్‌కు ఆదాయాన్ని తెచ్చిపెట్టే వనరులు అనేకం ఉన్నప్పటికీ సంబంధిత విభాగాల అధికారుల నిర్లక్ష్యం వల్ల ఆదాయానికి భారీగా గండిపడుతోంది. ముఖ్యంగా మూలకు చేరిన ప్రభుత్వ వాహనాలను ఏళ్ల తరబడి అలాగే వదిలేయడంతో తుప్పు పట్టి పోయి కనీసం స్క్రాప్‌కు కూడా అమ్మేందుకు పనికి రాకుండాపోతున్నాయి. తమ సొంత వాహనాలు పాడైతే మరమ్మతులు చేయడమో.. స్క్రాప్‌కి అమ్మేయడం వంటివి చేస్తారు కానీ ప్రభుత్వానికి సంబంధించిన వాహనాలు కాబట్టి నిర్లక్ష్యంగా వదిలేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.కోట్లాది రూపాయల ప్రజాధనం వృథాగా పోతున్నా కార్పొరేషన్ ఉన్నతాధికారులు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

లెక్కల్లో లేనివి ఎన్నో..

శ్రీకాకుళం నగరంలోని హెడ్‌వాటర్ వర్క్స్, ఆర్ట్స్ కాలేజీ రోడ్డులోని వాటర్ ట్యాంక్ వద్ద, కార్పొరేషన్ కార్యాలయం ఆవరణలో ఇలా చాలా చోట్ల డంపర్‌బిన్లు, చెత్త సేకరణ వాహనాలు, డీసీఎంలు, వాటర్‌ట్యాంక్ ట్రాక్టర్లు, ఓమిని బస్సు, ట్రాక్టర్లు, ఎక్స్‌వేటర్, ట్యాంకర్లు ఇలా 12 వాహనాలతో పాటు మరి కొన్ని వృథాగా ఉన్నాయి. లెక్కలో లేని వాహనాలు అనేకం ఉన్నట్లు తెలుస్తోంది. వాస్తవానికి ఏటా మూలకు చేరిన వాహనాలను వేలం వేసి విక్రయించాలి. ఇక్కడ మాత్రం అలాంటిదేమీ జరగడం లేదు. దీంతో పూర్తిగా తుప్పుపట్టి పూర్తిగా పాడైపోయి స్క్రాప్‌కి అమ్మితే చిల్లిగవ్వ వచ్చే పరిస్థితి లేకుండా చేశారు. మూలకు చేరిన వాహనాలను ఎంఎస్‌టీసీ (మెటీరియల్ స్క్రాప్ ట్రాన్స్‌పోర్టు కార్పొరేషన్‌కు) అమ్మకుండా వదిలేయడంతో వాహనాల్లో పాములు, పందులు, కుక్కలు తమ ఆవాసాలుగా చేసుకుంటున్నాయి. ఇప్పటికైనా కార్పొరేషన్ అధికారులు దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలని నగరవాసులు కోరుతున్నారు.

విక్రయిస్తాం..

మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న స్క్రాప్ వాహనాలను విక్రయిస్తాం. ఎక్కడెక్కడ పాడుబడిన వాహనాలు ఉన్నాయో తెలియజేయాలని ఇప్పటికే ఇంజినీర్లను కోరాం. పూర్తి వివరాలు వచ్చాక ఫైల్ సిద్ధం చేసి ఎంఎస్‌టీసీని పిలిచి అమ్మేస్తాం.

– కె.దక్షిణామూర్తి, మున్సిపల్ ఇంజినీర్, శ్రీకాకుళం కార్పొరేషన్



రోడ్డుపై దుమ్మును శుభ్రం చేసే వాహనాల పరిస్థితి



చెల్లాచెదురుగా ఉన్న ట్రాక్టర్లు, జీపులు, చెత్త వాహనాలు

ఎట్టకేలకు సర్క్యులేషన్ పేట్రన్‌కు మోక్షం



బొందిలీపురంలో ఇరుకురోడ్డు

- నేడు అధికారికంగా ప్రకటించే అవకాశం

శ్రీకాకుళం: నగరపాలక సంస్థ పరిధిలో పది నెలలకు పైగా పెండింగ్‌లో ఉన్న సర్క్యులేషన్ పేట్రన్ అంశానికి ఎట్టకేలకు మోక్షం లభించింది. గత ప్రభుత్వ హయాంలో అప్పటి రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు కృషి మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఈ అంశాన్ని ఆమోదించినప్పటికీ ఎన్నికల నుంచి ఇప్పటి వరకు మారిన ముగ్గురు కలెక్టర్లు అంతగా దృష్టి సారించలేదు. ఈ అంశం పెండింగ్‌లో ఉందని 'సాక్షి'లో ఇటీవల కథనం ప్రచురితం కావడంతో ప్రస్తుత కలెక్టర్ స్వప్నిల్ దినకర్ క్షుణ్ణంగా పరిశీలించి ఆమోదం తెలిపారు. కొన్ని సాంకేతిక పరమైన ఇబ్బందులు ఎదురుకావడం వల్ల ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయలేకపోయారు. సోమవారం దీనిని పూర్తి చేసి అధికారికంగా ప్రకటించనున్నారని తెలిసింది. అప్‌లోడ్ పూర్తయితే 15 అడుగుల కంటే తక్కువ వెడల్పు ఉన్న రోడ్లలో ఇంటి ముందు పది అడుగుల స్థలం వదలాలన్న ప్రభుత్వ నిబంధనలు పాటించకుండానే ఇంటి నిర్మాణం చేపట్టేందుకు వీలవుతుంది. ముఖ్యంగా నగరంలో ఉన్న 52 మురికివాడలు, నగర శివారు ప్రాంతాల్లో నివసిస్తున్న పేదలకు ఇంటి నిర్మాణానికి త్వరితగతిన అనుమతులు లభిస్తాయి. దీంతో ఆయా వర్గాలు వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మరో వారం రోజుల తరువాత నుంచి ఇటువంటి నిర్మాణాలకు అనుమతించే అవకాశాలు ఉన్నాయి.

ఆనందంగా ఉంది



మాకు కొద్దిపాటి స్థలం ఉంది. ఇల్లు కట్టుకునే సమయంలో పది అడుగుల స్థలం విడిచి పెడితే మిగిలిన స్థలం ఇల్లుకట్టుకునేందుకు సరిపోదు. ఇప్పుడలా కాకుండా ప్రభుత్వం నిబంధనలు సడలింపు చేయడం వల్ల మా ఇల్లు కట్టుకునే అవకాశం లభిస్తుంది. ఎంతో సంతోషంగా ఉంది.

– లక్ష్మి, కొత్తపేట, శ్రీకాకుళం మున్సిపాల్టీ

ప్రభుత్వం ఆమోదించింది



సర్క్యులేషన్ పేట్రన్‌కు ప్రభుత్వ ఆమోదం లభించింది. త్వరలోనే అధికారికంగా ప్రకటిస్తాం. 22 ప్రాంతాలకు అనుమతి లభించగా ఒక ప్రాంతానికి సంబంధించి అభ్యంతరం రావడంతో పెండింగ్‌లో ఉంది. మరో వారం తర్వాత నుంచి ఇలాంటి ప్రాంతాల్లో ఇంటి నిర్మాణ ప్లాన్లకు అనుమతిస్తాం.

– ప్రసాదరావు, మున్సిపల్ కమిషనర్, శ్రీకాకుళం

చెత్తబుట్టలు పంపిణీ చేసేదెన్నడో?



జె.ఆర్.పురంలో పాత తహసీల్దార్ కార్యాలయంలో చెత్త సేకరణ బుట్టలు నిరుపయోగంగా పడి ఉన్నాయి. వీటిని ఇప్పటి వరకు ప్రజలకు అందజేయకుండా పంచాయతీ అధికారులు నిర్లక్ష్యం వహించడం ప్రభుత్వ నిధులు దుర్వినియోగం చేయడమేనని పలువురు మండిపడుతున్నారు. అందరికీ సరిపడా బుట్టలు రాకపోవడం వల్లే పంపిణీ చేపట్టలేదని అధికారులు చెబుతుండటం గమనార్హం.

– రణస్థలం

మూలకు చేరిన జనరేటర్



ఎచ్చెర్ల తహశీల్దార్ కార్యాలయంలో జనరేటర్ మూలకు చేరింది. మరమ్మతులు చేయకపోవటంతో తుప్పు పట్టిపోతోంది. చాలా రోజులుగా ఇదే పరిస్థితి నెలకొన్నా పట్టించుకునే వారే కరువయ్యారు. ప్రభుత్వ నిధులు దుర్వినియోగం అవుతుండటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

– ఎచ్చెర్ల క్యాంపస్

రోడ్డుకు మోక్షమెప్పుడో?



చాపురం గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి అధ్వానంగా మారింది. ఈరోడ్డు వెంబడి చాపురం, సిద్ధిపేట గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. రోడ్డు బాగుచేయాలంటూ గ్రామస్తులు అనేకసార్లు అధికారులకు వినతిపత్రాలు అందిస్తున్న ఫలితం లేకుండాపోతోంది. ఇప్పటికైనా స్పందించాలని పలువురు కోరుతున్నారు.

–శ్రీకాకుళం రూరల్

హైవేపై అంధకారం



రణస్థలం మండల కేంద్రంలోని జె.ఆర్.పురంలో ఈ నెల 14న జాతీయ రహదారి అధికారులు లైట్లు ఏర్పాటు చేశారు. రెండు వారాలు కాకముందే మొరాయించాయి. హైవే లైట్లు వెలగకపోడంతో పాత పోలీస్‌స్టేషన్ వద్ద బస్సుల కోసం వేచి ఉండే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా హైవే అధికారులు స్పందించి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

– రణస్థలం

సాఫ్ట్‌బాల్ పోటీల్లో ప్రతిభ



ఎంపికైన క్రీడాకారులతో సాఫ్ట్‌బాల్ సంఘ ప్రతినిధులు, పీడీలు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఆలిండియా జూనియర్స్ సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు కాంస్య పతకాలు సాధించారు. కర్నూలు జిల్లా నంద్యాల వేదికగా జరిగిన ఆలిండియా జూనియర్స్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తృతీయస్థానంలో నిలిచింది. ఇందులో నలుగురు సిక్కోలు క్రీడాకారులు మెట్ట అఖిల్, యతిరాజుల లక్ష్మీప్రసాద్, మొదలవలస యశ్వంత్ (కేశవరావుపేట), సింహాద్రి (ఇప్పిలి) కీలకభూమిక పోషించారు. పతకాలు సాధించిన క్రీడాకారులను జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కలిదిండి నరసింహరాజు, ప్రధాన కార్యదర్శి సిగిలిపల్లి లక్ష్మీదేవి, జిల్లా కన్వీనర్ కలిదిండి వెంకటరామరాజు, కార్యనిర్వాహక కార్యదర్శి మొజ్జాడ వెంకటరమణ, ఉపాధ్యాక్షులు మెట్ట తిరుపతిరావు, ఎం.ఆనంద్‌కిరణ్, బి.సురేష్, గొంటి మల్లేష్, పి.వెంకటరమణ ఆదివారం అభినందించారు.

ప్రతిభావంతులకు పతకాల ప్రదానం



పతకాలు పొందిన విద్యార్థులతో ఎమ్మెల్యే

శ్రీకాకుళం కల్చరల్: పోటీలతో చిన్నారుల్లో ప్రతిభ వెలుగుచూస్తుందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. కలెక్టర్ బంగ్లా ఎదురుగా ఉన్న అయ్యప్ప దేవాలయంలో చిల్డ్రన్స్ లాఫింగ్ క్లబ్ చిన్నారులు ఇటీవల జాతీయ స్థాయిలో వివిధ పోటీలలో పాల్గొని బహుమతులు సాధించారు. వీరికి ఆదివారం ఎమ్మెల్యే చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా లాఫింగ్ క్లబ్ నిర్వాహకుడు ఎల్.నందికేశ్వరరావు మాట్లాడుతూ ముంబైకి చెందిన రంగోత్సవ్ సెలబ్రేషన్స్ నిర్వహించిన 10 రకాల పోటీల్లో చిల్డ్రన్స్ లాఫింగ్ క్లబ్‌కు చెందిన 40 మంది విద్యార్థులు విజయం సాధించారని చెప్పారు. విద్యార్థులతో పాటు టీచర్లు ప్రసాద్, దీప్తిలను కూడా సత్కరించారు. కార్యక్రమంలో లైన్స్ మెంటార్ నటుకుల మోహన్, కె.వి.జె.రాధాప్రసాద్, టూరిజం అధికారి నారాయణరావు, బీఎంఎస్ పట్నాయక్, ఎల్.రామలింగస్వామి, గుత్తు చిన్నారావు, నక్క శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

పుచ్చలపల్లి సుందరయ్య విగ్రహావిష్కరణ రేపు

శ్రీకాకుళం అర్బన్: స్వాతంత్య్ర సమరయోధుడు, దక్షిణ భారత కమ్యూనిస్టు నాయకుడు పుచ్చలపల్లి సుందరయ్య విగ్రహావిష్కరణ ఈ నెల 29న శ్రీకాకుళం శాంతినగర్ కాలనీలో ఉన్న గాంధీ మందిరం స్వాతంత్య్ర సమరయోధుల స్మృతి వనంలో జరుగుతుందని నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర నాయకులు బి.తులసీదాసు, నాయకులు, వివిధ రంగాల ప్రముఖులు హాజరవుతారని పేర్కొన్నారు.

అద్భుత గ్రంథం సౌందర్యలహరి



హరనాథరావును సత్కరిస్తున్న మందిరం సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్ :

శంకరాచార్యులు రచించిన అద్భుత గ్రంథం సౌందర్యలహరి అని అవధాన పండితుడు పైడి హరనాథరావు అన్నారు. నగరంలోని ఉపనిషన్మందిరంలో 'సౌందర్య లహరి–శక్తి తత్త్వం' అనే అంశంపై ఆదివారం ఆధ్యాత్మిక ప్రసంగం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని శక్తులకు మూలశక్తి అయిన ఆదిపరాశక్తి లీలను ఈ గ్రంథంలో అభివర్ణించారని పేర్కొన్నారు. నిత్య సాధన ద్వారా అమ్మవారి అభీష్టాన్ని పొందవచ్చని చెప్పారు. కార్యక్రమంలో మందిరం సభ్యులు మందుల మోహనరావు, డాక్టర్ పులఖండం శ్రీనివాసరావు, మనోహరరావు, పి.వి.ఎస్ ప్రసాద్, వి.కామేశ్వరరావు, కోమలరావు, జి.విశ్వేశ్వరరరావు తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా 'అణు' ప్రహరీ నిర్మాణం



కొవ్వాడలో నిర్మాణంలో ఉన్న ప్రహరీ

రణస్థలం: మండలంలోని కొవ్వాడ అణువిద్యుత్ కేంద్రం ప్రహరీ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మొదటి విడతలో రెండు కిలోమీటర్ల మేర ఈ ప్రహరీ నిర్మించనున్నారు. రెడీమెడ్ స్తంభాలు, పలకలతో పనులు నిర్వహిస్తుండటంతో రెండు మూడు నెలల్లోనే ప్రహరీ పూర్తవుతుందని అణు విద్యుత్ అధికారులు చెబుతున్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



ఒకే వేదికపై పూర్వ విద్యార్థులు

రణస్థలం : జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1983–84 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక ఆదివారం కొండములగాం సమీపంలోని ఓ అతిథి గృహంలో జరిగింది. ముందుగా ఆనాటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. అనంతరం ఆనాటి ముచ్చట్లు, జ్ఞాపకాలను ఒకరితో ఒకరు పంచుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మేకా శ్రీనివాస్, వి.వి.రామకృష్ణ, కె.నాగరాజు, కె.శ్రీనివాస్, సుధాకర్, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

ఆందోళనలో ఆయకట్టు రైతులు

- సాగునీటి కాలువల్లో కానరాని నీరు
- ఎండిపోతున్న పంటలు
- పట్టించుకోని పాలకులు



పూడివలస సమీపంలో ఎండుతున్న పంటలు

ఎచ్చెర్ల క్యాంపస్: గత రెండు దశాబ్దాలలో ఎన్నడూ చవిచూడని కరువు పరిస్థితి ఎచ్చెర్ల మండల రైతులు ఎదుర్కొంటున్నారు. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టిన వరి పంటలు కళ్ల ముందే వర్షాభావ పరిస్థితులతో ఎండిపోతుండటంతో తీవ్ర ఆందోళన చెందుతున్నారు. నారాయణపురం ఆయకట్టు కింద మండల పరిధిలో తొమ్మిది గ్రామ పంచాయతీలు ఉన్నాయి. అందులో 7175 ఎకరాల ఆయకట్టు భూములు ఉన్నాయి. ఖరీఫ్ ప్రారంభం నుంచి సాగునీటి కష్టాలు రైతులకు వెంటాడుతునే ఉన్నాయి. పంట గట్టెక్కుతుందన్న నమ్మకంతో ఎదలు, నాట్లు వేశారు. ప్రస్తుతం పంటలు ఎండిపోతున్నాయి. సాగునీటి విషయమై కలెక్టర్‌కు అనేకసార్లు ఫిర్యాదు చేసినా, ప్రత్యేక అధికారిని నియమించినా, లస్కర్లు ఏర్పాటు చేసినా, రైతులే కాలువలో పూడికలు తీసేందుకు సిద్ధపడినా నీరు మాత్రం అందడం లేదు. మరోవైపు దానా తుఫాన్ వర్షాలు కాపాడుతాయని అనుకున్నా చుక్కనీరు కూడా పడలేదు. దీంతో పంటలు కోల్పోయే పరిస్థితి దాపురించింది. పాలకుల్లో ముందస్తు వ్యూహం లేకపోవటం, సంతకవిటి, పొందూరు మండలాలు దాటి నీరు ఎచ్చెర్ల రాకపోవటం వంటి అంశాల వల్ల సాగునీటి ఇబ్బందులు ఏర్పడటంతో రైతుల శ్రమ బూడిదలో పోసిన పన్నీరుగా మారింది. ప్రధానంగా కుశాలపురం, తోటపాలేం, పొన్నాడ, కొత్తపేట, కొంగరాం, ముద్దాడ, బొంతలకోడూరు, ధర్మవరం, భగీరథపురం, ముద్దాడ తదితర పంచాయతీల పరిధిలో పరిస్థితి దారుణంగా మారింది. నీరు లేక పంటలు ఎండుతున్నాయి.



ధర్మవరం సమీపంలో పంట దుస్థితి



సింహద్వారం సమీపంలో వరిసాగు పరిస్థితి



కుశాలపురం పరిధిలో కాలువ ఇలా..